క్లుప్తంగా

ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

ఏటూరునాగారం: జాక్టో ఉపాధ్యాయ పక్షాల దీర్ఘకాలిక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల నిర్వహణ దిశగా అడుగులు వేయడం ఆహ్వానించదగ్గ విషయమని, ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం సరికాదని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ టీఎస్‌) ఏటూరునాగారం మండల అధ్యక్షుడు మంచర్ల వీరభద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా బదిలీలు, పదోన్నతుల నిర్వహణ అనేది ఉపాధ్యాయులచే పని చేయించుకునే ప్రభుత్వ బాధ్యత అన్నారు. అలాంటి బదిలీలు ఉపాధ్యాయులకు, విద్యారంగానికి మేలు చేకూర్చే విధంగా ఉండాలి అని అన్నారు. జీఓ 317 వల్ల హక్కుగా ఉన్న స్థానికతను కోల్పోయి ఉన్న ఊరికి, కన్నవారికి దూరంగా పని చేస్తున్న ఉపాధ్యాయులను ప్రస్తుత బదిలీలలో వారి సొంత జిల్లాలకు బదిలీ అవకాశం కల్పించాలని డిమాండ్‌ చేశారు.

ఆర్థిక సాయం



ములుగురూరల్‌: గోవిందరావుపేట మండల కేంద్రానికి చెందిన బండి సరోజన ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్‌ పార్టీ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రసపుత్‌ సీతారాంనాయక్‌ శనివారం పరామర్శించి రూ.5000 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు కనతల నాగేందర్‌రావు, పాలడుగు వెంకటకృష్ణ, జెట్టి సోమయ్య, పెండెం శ్రీకాంత్‌, సర్పంచ్‌ లావుడియ లక్ష్మీ, జోగానాయక్‌, రామచంద్రపు వెంకటేశ్వర్‌రావు, జంపాల చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శిగా సందీప్‌రావు



భూపాలపల్లి రూరల్‌: బీజేవైఎం భూపాలపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శిగా చిరుకొండ సందీప్‌రావును ఎన్నుకున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గొర్రె శశికుమార్‌ తెలిపారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో నియామకపత్రం అందించారు. తన ఎన్నికకు సహకరించిన పట్టణ అధ్యక్షుడు బుర్రసాయికుమార్‌కు, జిల్లా, మండలాల నాయకులకు సందీప్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జ్‌ ఉనుగొండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ సోషల్‌ మీడియా ఇన్‌చార్జ్‌గా వెంకటేష్‌

మహాముత్తారం: మండలకేంద్రానికి చెందిన పుట్టల వెంకటేష్‌ను కాంగ్రెస్‌ పార్టీ సోషల్‌ మీడియా మండల ఇన్‌చార్జ్‌గా నియమితులైయ్యారు. ఈ సందర్భంగా వెంకటేష్‌ను మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగమల్ల శారద, సర్పంచ్‌ల రాజయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌, గణేష్‌, కల్యాణ్‌, ప్రసాద్‌, గౌతంతోపాటు పలువురు శుక్రవారం రాత్రి కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. వీరికి మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కడువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లింగమల్ల శారద, ఎంపీపీ సుభద్ర, నాయకులు వంశిరాజ్‌, రాజునాయక్‌, నందు, రవి, రామగిరి రాజయ్య తదితరులు ఉన్నారు.

కమిటీ ఎన్నిక

మహాముత్తారం: మండలంలోని మాదారం గ్రామంలో శనివారం తెలంగాణ మాలమహానాడు గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మేడిపల్లి శ్రావణ్‌కుమార్‌, ఉపాధ్యక్షుడిగా అరవింద్‌, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌, సహాయ కార్యదర్శిగా మహేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

'సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం'

కాటారం: సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారం అందించడంలో మండల పరిషత్‌ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చింతకాని మాజీ సర్పంచ్‌ లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. కాటారం మండలం ఉమ్మడి చింతకాని గ్రామపంచాయతీ పరిధిలో ఈజీఎస్‌ ద్వారా నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు, నిర్మాణం, బిల్లుల చెల్లింపుల స్థితిగతులకు సంబంధించిన సమాచారం గూర్చి గత ఏడాది నవంబర్‌ 22న ఆర్టీఐ ద్వారా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. రెండు నెలలు గడుస్తున్న అధికారులు ఇప్పటి వరకు తనకు సమాచారం అందించలేదని, అడిగితే నిర్లక్ష్యపు సమాధానాలు చెపుతున్నారని పేర్కొన్నారు. ఆర్టీఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మంగపేట: అటవీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న గొత్తికోయ గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని జాతీయ హ్యూమన్‌ కమిషన్‌ సభ్యుడు (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మధన్‌గోపాల్‌(రిటైర్డ్‌ ఐఏఎస్‌) అన్నారు. మండలంలోని కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో గల రేగులగూడెం(గొత్తికోయగూడెంను ఐటీడీఏ పీఓ అకిత్‌తో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఛత్తీస్‌గఢ్‌ నుంచి ఎప్పుడు ఇక్కడికి వచ్చారని, ప్రస్తుతం ఎంత మంది జనాభా ఉన్నారు, రేషన్‌ కార్డులు ఉన్నాయా, ఓటు హక్కు కలిగి ఉన్నారా, సౌకర్యాలు ఎలా ఉన్నాయని తదితర అంశాలపై పూర్తి వివరాలను గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద మడకం లింగయ్య మాట్లాడుతూ.. 2000 సంవత్సరానికి ముందే ఇక్కడికి వలస వచ్చిన తాము ఆవాసాలను ఏర్పాటు చేసుకున్నామని ప్రస్తుతం 60 ఇళ్లలో 265 మంది జనాభా ఉన్నామని తెలిపారు. అలాగే



గిరిజనులతో మాట్లాడుతున్న మధన్‌గోపాల్‌

గ్రామంలో తాగునీరు, కరెంటు, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గత 23 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. పోడు భూములకు హక్కు పత్రాలు కొందరికి మాత్రమే వచ్చాయన్నారు. అందులో ఒక్కొక్కరికీ 3 నుంచి 4 ఎకరాలు ఉండగా అర ఎకరానికి మాత్రమే వచ్చాయని వాపోయారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు సాగునీటి వసతి కల్పించేందుకు బోర్లు వేయించి, విద్యుత్‌ సౌకర్యం కల్పించాని కోరారు. అనంతరం ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుడు మధన్‌గోపాల్‌ మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న గొత్తికోయ గిరిజనుల జీవన విధానం, వారి సమస్యలను తెలుసుకునేందుకు సందర్శించామన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్‌ త్వరలో బోర్లు వేయించేందుకు కృషి చేస్తారని తెలిపారు. అదే విధంగా గ్రామంలో నెలకొన్న తాగునీరు, విద్యుత్‌ సౌకర్యంతో పాటు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ఎఫ్‌డీఓ ప్రశాంత్‌పాటిల్‌(ఐఎఫ్‌ఎస్‌), మంగపేట రేంజ్‌ అధికారి షకీల్‌పాషా, పెసా కోఆర్డినేటర్‌ కొమరం ప్రభాకర్‌, జీసీసీ డైరెక్టర్‌ పులసం పురుషొత్తం, ఎఫ్‌ఎస్‌ఓ రవీందర్‌, ఎఫ్‌బీఓ షాలిని, దయానంద్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం

ములుగు: విద్యార్థుల పురోగతిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం అని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాఖ ఆదేశాలకు మేరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్‌ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఇచ్చే హోం వర్కులను పిల్లలతో పూర్తి చేసుకునేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేల చూడాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలుర పాఠ



మాట్లాడుతున్న డీఈఓ పాణిని

శాల హెచ్‌ఎం విజయమ్మ, క్వాలిటి కంట్రోల్‌ అధికారి బద్దం సుదర్శన్‌రెడ్డి, సాంబయ్య, జిల్లా సైన్స్‌ అధికారి అప్పని జయదేవ్‌ పాల్గొన్నారు.

సెక్యూరిటీ డిపాజిట్‌ చెల్లించలేం..



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారులు

వాజేడు: తాము సెక్యూరిటీ డిపాజిట్‌ చెల్లించలేమని ధర్మవరం 33/11 కేవీ విద్యుత్‌ వినియోగదారులు తేల్చి చెప్పారు. ఈ మేరకు మండల పరిధిలోని ధర్మవరం విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో వినియోగదారులు విద్యుత్‌ ఏఈ అర్షద్‌ అహ్మద్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. సెక్యూరిటీ డిపాజిట్‌ పేరుతో బిల్లులో రూ.200 నుంచి రూ.3000 వరకు వస్తుందని ఆరోపించారు. తాము దానిని చెల్లించలేమని గతంలోనే వినతిపత్రం ఇచ్చామని అయినప్పటికీ మళ్లీ వస్తుందని వాపోయారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం



కలెక్టర్‌ చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న మీడియా సభ్యులు

ములుగు: జిల్లా యంత్రాంగం తరపున గత రెండు రోజుల క్రితం నిర్వహించిన క్రికెట్‌ పోటీల్లో అటవీ శాఖ విజేతగా నిలిచింది. మీడియా టీం రెండో స్థానంలో నిలిచింది. కలెక్టర్‌ కృష్ణ ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరై మొదటి, రెండవ స్థానంలో నిలిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. మ్యాన్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌గా మీడియా టీం నుంచి దామోదర్‌, మ్యాన్‌ ఆఫ్‌ ద సిరీస్‌ గా అటవీ శాఖ నుంచి సుభాష్‌ బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. గెలుపొందిన వారికి అభినందనలు తెలిపారు. ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌ సూపరింటెండెంట్‌ రాజ్‌ ప్రకాష్‌, డీపీఆర్‌ఓ రఫిక్‌, క్రీడాకారులు జంగిలి కోటేశ్వరరావు, ఎండీ షఫీ అహ్మద్‌, కొట్టె రాజిరెడ్డి, పిట్టల మధు, నర రఘువీర్‌, గుడ్ల రాజు, గాదం దేవేందర్‌, జాలిగం శ్రీను, గాదం దేవేందర్‌, బైకాని నటరాజ్‌, గండ్రకోట విష్ణు, రాకేష్‌ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ఆకాష్‌ (ఫైల్‌)

మంగపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తాడ్వాయి మండల గంగారం గ్రామానికి చెందిన మృతుడు ఆకాష్‌(28) జీవనోపాధికోసం మంగపేటకు వచ్చి ఉంటున్నాడు. శుక్రవారం మంగపేట నుంచి ద్విచక్ర వాహనంపై రాజుపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బోరునర్సాపురం సంతోషిమాత ఆలయం సమీపంలో మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన్న ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ఆకాష్‌కు తీవ్ర గాయాలు కావడంతో మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌ ఎంజీఎంకు తరలించి చికిత్స చేయిస్తుండగా శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్య, కుమారుడు ఉన్నారు.

రిటైర్డ్‌ ఉద్యోగి మృతి



వెంకటయ్య (ఫైల్‌)

మంగపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని గంపోనిగూడెంకు చెందిన మండల వెంకటయ్య (65) అనే రిటైర్డ్‌ ఉద్యోగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 13న మండల కేంద్రం పరిధిలోని గంపోనిగూడెం వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు పక్క నుంచి నడుచుకుంటు ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో తవ్ర గాయాలయిన వెంకటయ్యను కుటుంబ సభ్యులు ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రవేట్‌ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు

భూపాలపల్లి రూరల్‌: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్లడం జరుగుతుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లిలో రూ. 25 లక్షల నిధులతో అంతర్గత సీసీ రోడ్లు, శ్యాంనగర్‌ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం పట్టణాల అభివృద్ధితో పాటు గ్రామాల్లో తాగునీరు, విద్యా, వైద్యం, తదితర అభివృద్ధి పనుల కోసం వేలాది కోట్లు వెచ్చిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌ చైర్‌పర్సన్‌ కళ్లెపు శోభ రఘుపతిరావు, ఎంపీపీ మందల లావణ్య సాగర్‌రెడ్డి, సర్పంచ్‌లు లకిడె కమలబాయి వెంకన్న, పుల్లూరి తిరుపతిరావు, ఎంపీటీసీ నర్సింగం, ఎంపీడీఓ అనిల్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కంటి పరీక్షలు చేయించుకోవాలి

వాజేడు: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలను చేయించుకోవాలని ఎస్సై కొప్పుల తిరుపతిరావు అన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామ పంచాయతీ ఆవరణలో రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుపతిరావు శనివారం కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి కళ్లు ప్రధానమైనవని వాటిని ఎప్పటికప్పుడు భద్రంగా కాపాడుకోవాలన్నారు. ఆయన వెంట వాజేడు వైద్యాధికారి అభినయ్‌, నాగారం సర్పంచ్‌ ఆదినారాయణ, వైద్య సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎస్సై

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని స్థానిక వేదవ్యాస హైస్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఒక రోజు ఉపాధ్యాయులుగా మారి పాఠలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి చదువుతోనే జీవితం బంగారు బాట అవుతుందని, ఎంచుకున్న రంగంలో వివిధ స్థాయిలో ఉంచడంలో చదువు కీలకం అన్నారు. ప్రధానోపాధ్యాయులిగా అశ్విత, ఎంఈఓగా సందీప్‌, కరస్పాండెంట్‌గా దివ్య బాధ్యతలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్‌ భాష బోయిన జగదీశ్వర్‌, డైరెక్టర్లు చింతిరెడ్డి సూర్యప్రకాశ్‌ రెడ్డి, పసునూటి రాజయ్య, దగ్గు ప్రభాకర్‌ రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

వ్యవసాయ కూలీ బిడ్డకు 'డాక్టరేట్‌'



పసరగొండ శేఖర్‌

మొగుళ్లపల్లి: మండలంలోని పాతఇస్సిపేట గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలైన పసరగొండ రాజమ్మ–పసరగొండ రాజయ్య చిన్న కుమారుడు పసరగొండ శేఖర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ విద్య విభాగం నుంచి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టర్‌ శేఖర్‌, డాక్టర్‌ విజయ కుమార్‌, అసోసియేట్‌ ప్రొఫెసర్‌, ఎస్‌ఐఆర్‌డీపీఆర్‌, ఎన్‌ఈఆర్‌సీ అస్సాం, గువహతి వారి పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్‌ నాలెడ్జి, స్కిల్స్‌ అండ్‌ పెర్సెప్షన్స్‌ ఆఫ్‌ సెకండరీ స్కూల్‌ టీచర్స్‌ ఆన్‌ క్లాసురూమ్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ ఇంటిగ్రేషన్‌ ఆఫ్‌ ఐసీటీ' అనే అంశంపై పరిశోధన నిర్వహించిన గ్రంథాన్ని ఉస్మానియా యూనివర్సిటీకీ సమర్పించగా యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ని ప్రదానం చేశారు. డాక్టర్‌ శేఖర్‌ పసరగొండ పరిశోధన చేసిన అంశం ప్రస్తుత పరిస్థితులలోని సెకండరీ పాఠశాల విద్యలో క్లాసురూమ్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ ఇంటిగ్రేషన్‌ ఆఫ్‌ ఐసీటీ ప్రాముఖ్యను గుర్తించి ఐసీఎస్‌ఆర్‌ న్యూఢిల్లీ ఫెల్లోషిప్‌కీ ఎంపిక కావడం గమనార్హం. డాక్టర్‌ శేఖర్‌ పసరగొండ పరిశోధన చేస్తున్న క్రమంలో 2019 సంవత్సరంలో కాచిగూడ వద్ద రెండు రైళ్లు ఢీకొట్టిన ప్రమాదంలో బలమైన గాయాలు తగిలినప్పటికిని క్రమంగా కోలుకుంటూ పట్టుదలతో విద్యలో డాక్టరేట్‌ సాధించడం గొప్ప విషయమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్‌ సాధించడంలో తనను ప్రోత్సహించిన సూపర్‌ వైజర్‌ డాక్టర్‌ టీ.విజయ కుమార్‌, పరిశోధక కమిటీలోని ఆచార్యులకు, సీనియర్‌ ప్రొఫెసర్‌లకు, కుటుంబ సభ్యులకు శేఖర్‌ పసరగొండ కృతజ్ఞతలు తెలిపారు.

కృష్ణా జలాలపై పట్టింపులేని ప్రభుత్వం

భూపాలపల్లి అర్బన్‌: రాష్ట్ర ప్రజలకు కృష్ణా జలాల్లో దక్కాల్సిన వాటా దక్కకపోగా కనీసం దాని గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్‌ రత్నం కిరణ్‌ అన్నారు. టీజేఎస్‌ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31వ తేదీల్లో నిర్వహించినున్న చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కృష్ణా జలాల్లో మన వాటా కోసం తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్‌ కోదండరాం నాయకత్వంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీలో దీక్ష, సెమినార్‌ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్‌ఎస్‌ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని



వాల్‌ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

భూదందాలు చేసుకుంటూ అమాయక ప్రజలపైన దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌ కమెర గట్టయ్య, కార్మిక సంఘాల నాయకులు రాలబండ బాబు, సీరంటే శ్రీధర్‌, దాసరి జనార్దన్‌, రవి, శంకర్‌, మోతె రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

'జాతర'ను అధికారికంగా నిర్వహించాలి

కాటారం: మండలంలోని ప్రతాపగిరి గొంతెమ్మ గుట్టపై నిర్వహించే జాతరను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. గొంతెమ్మ లక్ష్మీదేవరగుట్ట జాతర శనివారం రెండో రోజు వైభవంగా కొనసాగింది. శుక్రవారం రాత్రి ప్రారంభమైన జాతర వేడుక రెండో రోజు గుట్టపైకి లక్ష్మీదేవర, ఇతర దేవతామూర్తుల రాకతో సందడిగా మారింది. అంతకముందు జాతర కమిటీ, ఆలయ కమిటీ, నాయకపోడ్‌ సంఘాల ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన లక్ష్మీదేవర బృందాలు డప్పుచప్పుల్ల మధ్య సాంప్రదాయ నృత్యాలతో ఆడిపాడారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. అనంతరం గుట్టపైకి తరలివెళ్లారు. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ర్యాలీలో పాల్గొని లక్ష్మీదేవరలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత ప్రాచీన ఆనవాళ్లు, దైవ సంబంధిత చరిత్ర కల్గిన ప్రతాపగిరి గుట్టపై జరిగే జాతర ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ప్రభుత్వం జాతరను అధికారికంగా నిర్వహించి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు కల్పించాలని పేర్కొన్నారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ మహేశ్‌ రవీందర్‌రావు, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



లక్ష్మీదేవరలతో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

చిరుతల రామాయణం కార్యక్రమంలో ఎమ్మెల్యే

కాళేశ్వరం: మహదేవపూర్‌ మండలం అన్నారంలో చిరుతల రామాయణం పౌరాణిక ప్రదర్శన కార్యక్రమంలో శనివారం 'సీతారాముల కల్యాణం'ను నిర్వహకులు నిర్వహిస్తున్న నేపథ్యంలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరించిపోతున్న చిరుత రామాయణానికి అన్నారం యువత జీవం పోస్తుందని కొనియాడారు. ప్రస్తుతం ఉన్న యువతకు రామాయణం లాంటి పౌరాణిక ప్రదర్శనలు తెలుసుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ రమాదేవి, ఎంపీటీసీ దుర్గయ్య, ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సంతోష్‌, నగేష్‌ పాల్గొన్నారు.



కాళేశ్వరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకురావాలి

చిట్యాల: మండలంలో నేరాల నియంత్రించేందుకు దోహదపడే సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకురావాలని ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్‌ కోరారు. శనివారం మండలంలోని అందుకుతండా గ్రామంలో నేను సైతం కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని చెప్పారు. గ్రామంలో జరిగే దొంగతనాలు, ఆకతాయిల వ్యవహారాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలు దోహదపడుతాయని అన్నారు. ఎలాంటి అసాంఘీక కార్యక్రమాలు జరిగిన సీసీ కెమెరాలు ద్వారా పసిగట్టవచ్చని, సీసీ కెమెరాలు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ భాస్కర్‌ పాల్గొన్నారు.

'బీసీ బంధు' ప్రకటించాలి

మల్హర్‌: దళితబంధు మాదిరిగానే బీసీలకు బీసీబంధు ప్రకటించాలని బీసీ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మండలంలోని కొయ్యూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులైన బీసీలకు బీసీ బంధు తక్షణమే ప్రకటించాలన్నారు. 56 శాతం ఉన్న బీసీ ఫెడరేషన్‌ రుణాలు వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న గొల్ల కురమలకు గొర్లను పంపిణీ చేయాలన్నారు. బీసీ జాతీయ అధ్యక్షుడు ఆర్‌ కృష్ణయ్య పిలుపు మేరకు ఫ్రిభవరి 7, 8 తేదీల్లో జరిగే పార్లమెంట్‌ సమావేశం ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమ్మయ్య, ఓదెల బ్రహ్మచారి, ఓదేలు, పావిరాల వెంకటి, రాములు ఉన్నారు.

ఎంఎస్పీ బలోపేతానికి కృషి

కాటారం: మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్పీ) బలోపేతానికి ప్రతి కర్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్‌ అంబాల చంద్రమౌళి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్టహౌస్‌లో శనివారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల ఇన్‌చార్జ్‌గా చంద్రగిరి అశోక్‌ను నియమించారు. అనంతరం చంద్రమౌళి మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, సమానత్వమే లక్ష్యంగా మందకృష్ణ మాదిగ మహాజన సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం పలువురు ఎంఎస్పీ పార్టీలో చేరగా చంద్రమౌళి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సంతోష్‌, రాజేశ్‌, శ్రీనివాస్‌, శ్రావణ్‌, నరేశ్‌ ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్లు నోముల శ్రీనివాస్‌, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ గాజుల భిక్షపతి, నాయకులు ప్రవీణ్‌, ఎమ్మార్పీఎస్‌ మండల అధ్యక్షుడు శ్రీధర్‌ పాల్గొన్నారు.